

ఇంకుడు గుంత పనులు పరిశీలిస్తున్న నవీన్ గౌడ్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్

ఇంకుడు గుంతలు ఓ సామాజిక బాధ్యత

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అడుగంటి పోతున్న భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ భవనాల వద్ద తప్పనిసరి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని జలమండలి కార్యాలయ ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు పనులను జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నీటిని వృథగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ జలమండలి ఎండీ ఆదేశాల ప్రకారం భవనాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇంకుడు గుంతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 300 స్క్వేర్ మీటర్లు గల ఇళ్ల నిర్మాణాలు ఉన్న స్థలంలో తప్పనిసరి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ విషయమై ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, జలమండలి సిబ్బంది సాయి, అనిల్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రాములు భౌతికకాయం వద్ద సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

బీఆర్ఎస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ. రాములు(80) శుక్రవారం మృతి చెందగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, ముఠా జైసింహా, పూస గోరక్‌నాథ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పార్టీ ముషీరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బండారి గోపాల్, ఉపాధ్యక్షులు టిల్లూ, కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌లు నివాళులు అర్పించారు.

ట్రాన్స్‌జెండర్ల నిరసన

కవాడిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తమను ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా ప్రభుత్వం నియమిస్తే బీఆర్ఎస్ మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, పద్మారావుగౌడ్‌లు హేళన చేయడాన్ని ట్రాన్స్‌జెండర్లు ఖండించారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీశ్రీ విగ్రహం ఎదుట నిరసన నిర్వహించారు.

‘ తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం’

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సంజీవయ్య నగర్ బస్తీ ప్రజలకు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తెలిపారు. సంజీవయ్యనగర్ బస్తీలో నూతన మంచినీటి పైపులైన్ పనులను బస్తీవాసులు, బీజేపీ నాయకులతో కలిసి ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బస్తీలో ఇటీవల 3.10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్న సాయిచంద్, ఉమేశ్, మదన్‌మోహన్, కుమార్, జ్ఞానేశ్వర్, సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, విఠల్, ప్రశాంత్, రాజ్‌కుమార్, బస్తీనాయకులు రమేశ్, రాజయ్య, అనిల్, విజయ్, చింటు, లావణ్య, లక్ష్మి, విజయ ఉన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఇంటర్ డివిజనల్ కల్చరల్ ఫెస్ట్ - 2025ను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి ఎఫ్‌సీఐ ఉద్యోగులు పాల్గొన్నారు. ఒక్కో జిల్లా వారు ఒక్కో గ్రూపుగా ఏర్పడి.. నాటికలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఎఫ్‌సీఐ డీజీఎం ఎస్‌కే చౌదరి, ఉన్నతాధికారులు మృత్యుంజయ కుమార్, గజానంద్, నీరజ్ కుమార్, డా. రాజన్, ప్రమోద్, రాము పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ నగర కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా వెల్లడించారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఆవిర్భావ వేడుకలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సేవా కార్యక్రమాల నిర్వహణకు ముఖ్యఅతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం. అరవింద్ కుమార్ గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. తొలుత నేతలకు సామగ్రిని అందజేశారు. నాయకులు కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, ఎస్. ప్రకాష్, విజయ్, వినోద్, కిరణ్‌కుమార్, భానుప్రకాష్, జగదీష్‌గౌడ్, విక్రమ్, రామారావు పాల్గొన్నారు.



శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి భారీ కటౌట్ ఆకట్టుకుంటున్నది. విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఇది అందరినీ ఆకర్షిస్తోంది.

(రాంనగర్, ఆంధ్రజ్యోతి)

● జలసంరక్షణ అందరి బాధ్యత



జలసంరక్షణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విద్యాసంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ శాఖలు, మార్పు సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జలసంరక్షణకు ప్రతీఒక్కరు పాటుపడాలని జలమండలి మేనేజర్ జీవనజ్యోతి తెలిపారు.

రాంనగర్, (ఆంధ్రజ్యోతి):

● సామూహిక ప్రార్థనలు

పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చివరి శుక్రవారం సామూహిక ప్రార్థనలు చేశారు. భోలక్‌పూర్‌లోని ప్రసిద్ధి గాంచిన బడీమసీదులో ఒకేసారి 5 వేల మందికి పైగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదు వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముషీరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):



ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏది?

- పొంచి ఉన్న ముప్పు
- భయాందోళనలో ఆజామాబాద్ వాసులు



సెయింట్ ఫాయిస్ స్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితి



సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ వద్ద ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆజామాబాద్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి చుట్టూ ఫెన్సింగ్ సరిగా లేకపోవడం, వైర్లు నేలకు తాకుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. రాంనగర్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్, సెయింట్ ఫాయిస్ స్కూల్, మదర్స్ హైస్కూల్, మేదరబస్తీ, జెమినికాలనీ లైబ్రరీ, రాంనగర్‌లోని ఇందిరా ఏస్టేట్ వీధి, అచ్చయ్యనగర్ ప్రాంతాలలోని ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ లేదు. ఈ ఏరియాల్లోని పిల్లలు ఆడుకుంటారు. దాని ముందు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి చోట విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, వేలాడుతున్న వైర్లను సరి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనేక సార్లు ఫిర్యాదు చేశాను



ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేశాం. పాఠశాలల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తక్షణమే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. వేసవిలో ప్రమాదం జరగకుండా ట్రాన్స్‌కో అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

కొండ శ్రీధర్‌రెడ్డి, స్థానికుడు

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

- డీసీపీ బాలస్వామి

బర్కత్‌పుర, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్, శ్రీరామనవమి పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని తూర్పు మండల డీసీపీ బాలస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 31న రంజాన్, ఏప్రిల్ 6న శ్రీరామనవమి జరగనున్నాయని ఈ రెండు పండుగలు ప్రశాంతంగా జరిగేలా పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. శుక్రవారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ హాల్‌లో తూర్పు మండలం పరిధిలోని పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం పెద్దలు, ఆలయాల నిర్వాహకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ర్యాలీలకు పోలీసు అనుమతి తప్పనిసరి అని అన్నారు. ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ఆలయాలు, మసీదుల వద్ద పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థతో నిఘా మరింత పెంచుతామని అన్నారు. పండుగల వేళ ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు మండలం అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, ఏసీపీలు కె. శంకర్, జైపాల్‌రెడ్డి, జగన్, సీఐలు, డీఐలు, ఎస్ఐలు, పీస్ కమిటీ సభ్యులు ఎక్కాల కన్నా, నందకిషోర్‌యాదవ్, శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



బాలస్వామిని కలిసిన పీస్ కమిటీ సభ్యులు ఎక్కాల కన్నా, నందకిషోర్

మహేష్‌గౌడ్‌ను కలిసిన నేతలు

టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ భద్రయ్య, లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ఆమోదించే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానన్నారు.



రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు, చిక్కడపల్లి, మూన్ కేఫ్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు, డీడీహెచ్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4.30వరకు, విద్యానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 4.30 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రేపు ఉగాది వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వంశీ సంస్థల ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ఈ నెల 30న సాయంత్రం ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకుడు డా. వంశీ రామరాజు తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విశ్వావసు నామ ఉగాది సందర్భంగా వేద పఠనం, సంతోశ్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం, రామరాజు తరంగిణిచే శాస్త్రీయ సంగీత గానగోష్ఠి ఉంటాయని తెలిపారు. విద్యాశంకరస్వామి.. ఉగాది సందేశమిస్తారని, టీటీడీ ఆస్థాన వేద పండితులు భట్టార్ సుందర ప్రహ్లాదాచార్యులకు వంశీ వేద.. ఉగాది పురస్కారం బహూకరిస్తామని తెలిపారు.

‘నిరంతరం తనిఖీలు చేస్తున్నాం’

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జంటనగరాల్లోని వ్యాపార, వాణిజ్యసంస్థల్లో నిరంతరం తనిఖీలు చేస్తున్నామని తూనికలు, కొలతల శాఖ జంటనగరాల అసిస్టెంట్ కంట్రోలర్ శివానంద్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, పెట్రోల్ బంక్‌లు, మాల్స్ జువెలరీ షాపులు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలపై నిఘా ఉంచామన్నారు. తూకంలో తేడా లేకుండా వ్యాపారం చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా తూకంలో మోసాలకు పాల్పడినట్లు అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని శివానంద్ సూచించారు.

అలరించిన సంగీత విభావరి

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వసంతగానం సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవికృష్ణ, రమణారెడ్డి, కవిత, వాణికుమారి, భాగ్యలక్ష్మి తదితర ప్రముఖ గాయనీగాయకులు పలు పాత, కొత్త గీతాలు ఆలపించి శ్రోతలను అలరించారు. గాయనీగాయకులను నిర్వాహకులు జి. కృష్ణ అభినందించారు.

కావ్య రచనలో తొలి రచయిత్రి మొల్ల

- సంస్మరణ సభలో విశ్రాంత జడ్జి కాశీవిశ్వేశ్వరరావు

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో కావ్య రచనలో తొలి రచయిత్రి మొల్ల అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గానసభలో ఆతుకూరి మొల్ల యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ మొల్ల స్వయంకృషితో సాహిత్యంలో నాటి కవి పండితులకు సమ ఉజ్జీగా ఎదిగి రామాయణం మహాకావ్యం రచన చేశారని వివరించారు. సభలో గాయకుడు త్రినాథరావు, శంకర్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విలువలకు ప్రతీకగా సృజన సాంస్కృతిక కార్యక్రమాలు

చిక్కడపల్లి మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సృజన సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మక విలువలకు ప్రతీక అని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సృజన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. రెవెన్యూ శాఖ మంత్రి ఓఎస్‌డీ శ్రీలక్ష్మి, ప్రముఖ వైద్యుడు అఖిల్ దాడిని, సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎస్ ప్రసాద్, అపోలో ఆస్పత్రి డైటీషియన్ హరిక శ్యామ్, సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్‌లను సృజనాత్మక ప్రతిభా పురస్కారాలతో సాంస్కృతిక సంస్థల ప్రముఖులు వంశీ రామరాజు, వెంకటరెడ్డి, నాట్యగురువు ప్రసన్నరాణి, సీనియర్ పాత్రికేయులు ఆర్‌వీ రమణలను ఉగాది పురస్కారంతో సత్కరించి అభినందించారు.

ట్రాన్స్‌జెండర్ల ఆవేదనకు అద్దంపట్టిన డాక్యుమెంటరీ

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హస్త కళాకారిణి పి.కమలాప్రసాదరావు హర్ ఆర్ట్ గ్యాలరీ డాక్యుమెంటరీ ఆ - మ అనే లఘు చిత్రప్రదర్శన శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని దాశరథి థియేటర్‌లో జరిగింది. హర్ ఆర్ట్ గ్యాలరీ విశేషాలతో కూడిన ఈ డాక్యుమెంటరీ చిత్రానికి ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు పర్యవేక్షణలో గౌతమ్ చిత్రీకరణ చేయగా, ఎం.వి.ఆర్.ఎస్.ఎస్. మూర్తి దర్శకత్వం వహించారు. ఈ డాక్యుమెంటరీ చిత్రం నేటి సమాజంలో ట్రాన్స్‌జెండర్ల ఆవేదనకు అద్దం పట్టింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కవాడిగూడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాలలో రాణించాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ రచనశ్రీ, స్థానిక హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ అమృత హాజరయ్యారు.సమాజాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. అప్సా కో ఆర్డినేటర్ బొట్టు రమేష్, ప్రతినిధులు శ్రావణి, లావణ్య, మల్లిక, ఇందిర, బండానగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఆశా వర్కర్లు సరస్వతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ రచనశ్రీని సన్మానిస్తున్న అప్సా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు



మోజన్, ఇమామ్‌లను సన్మానిస్తున్న మహమూద్

మోజన్, ఇమామ్‌లకు సన్మానం

చిక్కడపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఖురాన్‌ను 26 రోజుల్లో చదవడం పూర్తి చేసిన మోజమ్, ఇమామ్‌లను గాంధీనగర్ సబర్మతినగర్ మసీదులో శుక్రవారం బీజేపీ మైనార్టీ మోర్చా(వక్ఫ్‌బోర్డు) రాష్ట్ర కార్యదర్శి ఎండీ మహమూద్ సన్మానించారు. అనంతరం వారికి నగదు పురస్కారం అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని యేటా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సదర్‌సాబ్, హఫీజ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

2న బీసీల పోరుగర్జన

- టీపీసీసీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్



శ్రీకాంత్‌గౌడ్

రాంనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బీసీ డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 2న ఢిల్లీ.. జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగర్జన నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్‌లు తెలిపారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి.. 42 శాతం బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించారన్నారు. ఇది దేశానికే మార్గదర్శకం అని తెలిపారు. వచ్చేనెల 2న ఢిల్లీలో బీసీ కుల సంఘాలతో కలిసి పోరుగర్జన చేపడుతున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సారథ్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు అన్ని పార్టీల ఎంపీలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.